సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



అంగన్‌వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

పాడేరు, చింతూరు డివిజన్లలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. IIలో



కష్టపడితే విజయం తథ్యం

యువత కష్టపడి చదివితే విజయం తథ్యమని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి అన్నారు. IIలో



ఘనంగా క్షీరాభిషేకం

విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. IIలో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం

సాక్షి ,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది.ఎస్సీ సెల్ జోనల్ ఇన్ చార్జిగా కిముడు శ్రీనివాస విశ్వ ప్రసాద్‌నాయుడు,రాష్ట్ర కార్యదర్శులుగా పండ రామకృష్ణదొర, గబ్బాడి సన్యాసిదొర, వంతాల బాబూరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా జన్ని నరసింహమూర్తి, మజ్జి జయవర్ధిని, కురుడుబోయిన గంగరాజు, కూడా సురేష్‌కుమార్, కిల్లు కోటిబాబు నియమితులయ్యారు. పలు కమిటీల్లోనూ నేతలకు సముచిత స్థానం కల్పించారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన మొస్యా బుజ్జిబాబు, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కుడినోయిన గంగరాజు,వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శోభ ధర్మయ్యదొరను నియమించారు.

బంద్ నేపథ్యంలో వాహనాల దారి మళ్లింపు

చింతూరు: బంద్ నేపథ్యంలో మావోయిస్టులు ఏవైనా ఘటనలకు పాల్పడవచ్చనే అనుమానంతో తెలంగాణ వైపును వెళ్లే వాహనాలను పోలీసులు శుక్రవారం రాత్రి కూనవరం జంక్షన్ మీదుగా మళ్లించారు. ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వాహనాలు నిత్యం చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి, నెల్లిపాక మీదుగా భద్రాచలం వెళుతుంటాయి. బంద్ నేపథ్యంలో చింతూరు మండలం చట్టి, ఎటపాక మండలం నెల్లిపాక వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన పోలీసులు చట్టి వైపు నుంచి వెళ్లే వాహనాలను కూనవరం జంక్షన్ మీదుగా భద్రాచలం వెళ్లేలా చర్యలు చేపట్టారు. భద్రాచలం నుంచి వచ్చే వాహనాలను భీమవరం జంక్షన్ మీదుగా చట్టి వచ్చేలా దారి మళ్లించారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు చింతూరు సీఐ గజేంద్రకుమార్ తెలిపారు.

జాబ్‌మేళాలో 14 మంది ఎంపిక



జాబ్‌మేళాకు హాజరైన యువతతో అధికారులు

అరకులోయ టౌన్: స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు 14 మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి. ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 26 మంది హాజరు కాగా 14 మంది ఎంపికైనట్టు చెప్పారు. అపోలో ఫార్మసీ, నవత ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం. సతీష్ కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మధుచందనకు కాంస్య పతకం



చింతూరు: బిహార్‌లోని పాట్నాలో జరుగుతున్న 67వ జాతీయ స్కూల్ గేమ్స్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో చింతూరుకు చెందిన గుత్తుల మధుచందన కాంస్యపతకం సాధించింది. ఈనెల 13న ప్రారంభమైన ఈ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. స్థానిక కేజీబీవీకు చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని మధుచందన అండర్–17 విభాగం 81 ప్లస్ కేటగిరీలో కాంస్యపతకం సాధించింది. ఆమెను కోచ్ గోలి గంగాధర్‌తో పాటు గ్రామస్తులు అభినందించారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

- ఉధృతంగా చలిగాలులు
- చింతపల్లిలో 8.5, మినుములూరులో 12, అరకులోయలో 12.2 డిగ్రీల నమోదు



అరకులో చలిమంట కాగుతున్న ప్రజలు

సాక్షి,పాడేరు: మన్యంలో చలిగాలులు ఉధృతంగా వీస్తున్నాయి. పొగమంచు తీవ్రత తగ్గినప్పటికీ కనిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం కొనసాగుతున్నాయి.చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 8.5డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 12డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 12.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.చలితీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం, రాత్రి సమయాల్లో ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. మధ్యాహ్నం మాత్రం ఎండ చుర్రుమంటోంది.

అలుపెరగని ఆపద్బంధు

ప్రమాదాలు, అత్యవసర సమయాల్లో బాధితులను, రోగులను ఆస్పత్రులకు తరలించడం, ప్రథమ చికిత్స అందించడంలో 108 వాహనం నంబర్ వన్‌గా నిలుస్తోంది. లక్షలాది మందిని ప్రాణాపాయం నుంచి కాపాడిన అపర సంజీవనిగా పేరొందింది. ఒక్క ఫోన్ చేస్తే చాలు నేనున్నానంటూ నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని ఆపద్బంధవుగా ఆదుకుంటోంది.



ఈమె పేరు రాజమ్మ. పెదబయలు మండలం అరడకోట పంచాయతీ కాగువలస. ఆమెకు పురిటి నొప్పులు అధికమవడంతో కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేశారు. ఈఎంటీ చిన్నవాడు, పైలెట్ రమేష్ హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. ఆమెను వాహనంలోపెదబయలు పీహెచ్‌సీకి తరలిస్తుండగా పురిటి నొప్పులు మరింత అధికమయ్యాయి. దీంతో వాహనాన్ని మార్గం మధ్యలో నిలిపి,ఆమెకు సుఖ ప్రసవం చేశారు. రాజమ్మ పండంటి కవలలను ప్రసవించింది.108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ నాలుగేళ్లలో 108 సిబ్బంది ఇలా ఎంతో మందికి సకాలంలో వైద్య సేవలందించారు.

- నాడు నిరాదరణ– నేడు ఆదరణ
- జిల్లాలో ఈ నాలుగున్నరేళ్లలో 99,718 మంది తరలింపు
- 26,929 మంది గర్భిణులకు 108 సేవలు

పాడేరు: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 108 సేవలు పురుడుపోసుకున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు విశేష సేవలందించాయి. అనంతరం చంద్రబాబు హయాంలో మూలకు చేరాయి. తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 108 వాహనాల్లో అత్యాధునిక పరికరాలు, సౌకర్యాలు ఏర్పాటు చేసింది. దీంతో ఏటా వేలాది మందికి అత్యవసర సేవలు అందిస్తున్నాయి

ఫోన్ చేసిన క్షణాల్లో..

గతంలో జిల్లాలో రోడ్డు, రవాణా సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉండేవి. గ్రామాల్లో గిరిజనులు అనారోగ్యానికి, రోడ్డు ప్రమాదాలకు గురైనా, ఆపదలో ఉన్నా సకాలంలో ఆస్పత్రులకు వెళ్లలేని దుస్థితి. సకాలంలో వైద్యం అందక పలువురు మృత్యువాత పడిన ఘటనలున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారాయి. మారుమూల గిరిజన గ్రామాల్లో రూ.కోట్లు వెచ్చించి రహదారులు నిర్మించారు. రవాణా సౌకర్యం మెరుగుపడింది. వాహనాల రాకపోకలకు మార్గం సుగమమైంది. 108 వాహనాలకు పూర్తి జవసత్వాలు సమకూర్చారు. ఆధునిక పరికరాలు, సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి, పగలు తేడా లేదు, పల్లె, పట్టణం అనే భేదం లేదు. ఆపదలో ఉన్నామని ఫోన్ వస్తే చాలు 108 సిబ్బంది క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుని, కొండంత భరోసా ఇస్తున్నారు. ప్రథమ చికిత్స, సపర్యలు చేయడంతో పాటు వాహనంలో సమీప ఆస్పత్రులకు వెంటనే తరలిస్తున్నారు సకాలంలో వైద్య సేవలు అందడంతో బాధితులు కోలుకుని సాధారణ స్థితికి చేరుకుంటున్నారు.



పాడేరులో 108 వాహనాలు

బాబు హయాంలో దౌర్భాగ్యం..

ఎంతో ఉన్నత ఆశయంతో ప్రవేశపెట్టిన 108 పథకాన్ని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఆపదలో ఉండే ఎవరైనా 108కు ఫోన్ చేస్తే డీజిల్ లేదంటూ సిబ్బంది ముఖం చాటేసేవారు. చాలా వాహనాలు మరమ్మతులకు గురై మూలకు చేరిన పరిస్థితి ఉండేది. గిరిజన ప్రాంతంలో ఒక్క వాహనాన్ని కూడా మంజూరు చేయలేదు. గతంలో వైఎస్సార్ హయాంలో ఇచ్చిన వాహనాలతోనే కాలక్షేపం చేశారు. 108 వాహనాలకు గిరిజనులకు పూర్తిగా దూరమయ్యాయి.

జగన్ హయాంలో వైభవం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సౌకర్యాలతో కొత్త వాహనాలను సమకూర్చారు. గతంలో మండలానికి ఒక్కో అంబులెన్స్ అందుబాటులో ఉంటే ఇప్పుడు రెండేసి అంబులెన్స్‌లు కేటాయించారు. వీటితో పాటు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు, చిన్నారులకు కోసం రెండు నియోనటల్ ప్రత్యేక అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చారు. ప్రతి అంబులెన్స్‌లో తగినంత సిబ్బందిని కూడా నియమించారు.

గత నాలుగున్నరేళ్లలో అందించిన సేవల వివరాలు		
సంవత్సరం	సేవలు పొందిన వారు	గర్భిణులు
2020	9,300	3,157
2021	28,445	7,685
2022	32,019	8,076
2023	29,954	8,011

వేలాది మందికి సేవలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లా వ్యాప్తంగా వేలాది మంది 108 సేవలను వినియోగించుకుంటున్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 99,718 మంది సహాయార్థులకు, మరో 26,929 మంది గర్భిణులకు 108 సిబ్బంది సేవలందించారు. గత ప్రభుత్వం హయాంలో ఏడాదంతా లెక్కపెట్టినా 10వేల మందికి కూడా సేవలు అందేవి కావు. నేడు ఏడాదికి 40వేల మందికిపైగా సేవలు అందుతున్నాయి.

జిల్లా సమాచారం

మొత్తం అంబులెన్సులు	అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు	బేసిక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు	ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు (ఈఎంటీ)
26	03	21	63 మంది
డ్రైవర్లు (పైలెట్లు) 64 మంది	నియోనేటల్ అంబులెన్సులు (చిన్నారుల కోసం) 02		



గర్భిణిని స్ట్రెచర్‌పై మోసుకొని వస్తున్న 108 సిబ్బంది

పాడేరు– పెదబయలు మండలాల సరిహద్దు మారుమూల కుంతుర్ల పంచాయతీ లుంజరిపుట్టు గ్రామానికి చెందిన కళావతి అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో గ్రామస్తులు గత ఏడాది ఆగస్టు నెల 27న 108 సిబ్బందికి ఫోన్ చేశారు. దీంతో 108 సిబ్బంది వెంటనే బయలుదేరారు. పాడేరుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నా కిముడుపల్లి వరకు రోడ్డు సౌకర్యం ఉండడంతో అక్కడి వరకు వెళ్లారు. అక్కడ నుంచి సుమారు 3 కిలోమీటర్లు మేర కాలినడక వెళ్లిన ఈఎంటీ కల్యాణి, పైలట్ ప్రతాప్ స్ట్రెచర్‌పై గర్భిణిని 108 వాహనం వరకు మోసుకొచ్చారు. నొప్పులు మరింత ఎక్కువ కావడంతో అక్కడే ఆమెకు సుఖ ప్రసవం చేశారు. ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో బాలింత కళావతి 108 సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఆ గ్రామానికి ఇప్పుడు రోడ్డు నిర్మించారు.

ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం



జిల్లా వ్యాప్తంగా ఉన్న మారుమూల గ్రామాల గిరిజనులు అనారోగ్యానికి గురైనప్పుడు, రోడ్డు ప్రమాదాలు తదితర సంఘటనలు జరిగినప్పుడు 108కు ఫోన్ చేసిన వెంటనే స్పందిస్తున్నాం. తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుంటున్నాం. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక 108 సేవలు ఎంతగానో మెరుగుపడ్డాయి. డీజిల్, ఇతరత్రా అవసరాలకు ప్రభుత్వం నుంచి నిధులకు ఎలాంటి ఇబ్బందులు లేవు.

– కె. ఇబ్రహీం, 108 జిల్లా కో ఆర్డినేటర్, పాడేరు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి



హాజరైన మహిళా సంఘాల సభ్యులు

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
- వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ
- నాలుగు విడతల్లో రూ. 9.03 కోట్ల మేర లబ్ధి

రంపచోడవరం: ఏజెన్సీలో మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేశారని తెలిపారు. మహిళా సంఘాలకు సంబంధించి నాలుగు విడతలుగా ఇప్పటివరకు ఆసరా పథకంలో రూ. 9కోట్ల 2లక్షల 97 వేలు వారి ఖాతాల్లో జమచేసినట్టు పేర్కొన్నారు. ఏజెన్సీలో చేయూత పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.10 వేలు మంజూరయ్యాయన్నారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. వివిధ పథకాల అమలులో భాగంగా లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 160 కోట్లు జమ చేసినట్టు చెప్పారు. పోడు భూములకు పట్టాలు ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఏజెన్సీలోని 157 పంచాయతీల్లో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. వైఎస్సార్ సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. ఏజెన్సీలో వైద్య సేవలు బలోపేతం చేసేందుకు రంపచోడవరంలో రూ. 50 కోట్ల వ్యయంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. 30 సెల్ టవర్లు ఏర్పాటు చేసి మారుమూల గ్రామాలకు కమ్యూనికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. 2019 నుంచి ఏజెన్సీలోని 11 మండలాల్లో రూ. 80 కోట్ల మేర ప్రభుత్వం రుణాలు తీర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, ప్రసాద్, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, సాయిబాబా, నర్రి పాపారావు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థికి తప్పిన ప్రాణాపాయం

- డెంగ్యూ జ్వరానికి సకాలంలో కేజీహెచ్‌లో వైద్య సేవలు
- కోలుకోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం
- చొరవ తీసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్
- కృతజ్ఞతలు తెలిపిన తండ్రి



కేజీహెచ్‌లో కోలుకున్న గిరిజన విద్యార్థి చిరంజీవి

సాక్షి,పాడేరు: డెంగ్యూ జ్వరం కారణంగా ప్రాణాపాయ స్థితికి చేరుకున్న చింతపల్లి గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థి జర్తా చిరంజీవికి మెరుగైన వైద్య సేవలందించడంతో కోలుకున్నాడు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌లు సకాలంలో స్పందించి చిరంజీవికి కేజీహెచ్‌లో ఉన్నత వైద్యసేవలు కల్పించడంతో ప్రాణాపాయం తప్పింది. కొయ్యూరు మండలం మఠం భీమవరానికి చెందిన జర్తా చిరంజీవి చింతపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో టెన్త్ చదువుతున్నాడు.ఈనెల 9న డెంగ్యూ కారణంగా అస్వస్థతకు గురైన చిరంజీవి చింతపల్లి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రుల్లో వైద్య అందించినా ప్రయోజనం లేకపోయింది. బీపీ తగ్గిపోతుండటంతో పాటు ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయి. వెంటనే కేజీహెచ్‌కు తరలించాలని నర్సీపట్నం వైద్యులు సూచించారు. ఈ విషయాన్ని ఏటీడబ్ల్యూవో నాగజయలక్ష్మి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ దృష్టికి తీసుకువెళ్లారు. వారు హుటాహుటిన సమకూర్చిన అంబులెన్సులో కేజీహెచ్‌కు తరలించారు. అంతేకాకుండా విద్యార్థి చిరంజీవికి మెరుగైన వైద్యం అందేలా కలెక్టర్, ఐటీడీఏ పీవో చర్యలు తీసుకున్నారు. తన కుమారుడి ప్రాణం కాపాడిన వారికి తండ్రి పెంటయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ గిరిజన విద్యాలయాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు.ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులు అనారోగ్యానికి గురైతే సకాలంలో ఆస్పత్రులకు తరలిస్తున్నామన్నారు.మెరుగైన వైద్యసేవలు అందించేలా హెచ్‌ఎం, వార్డెన్లు,మేట్రిన్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు

- ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
- రూ.12.06 కోట్లతో నిర్మించిన ప్రసూతి, శిశు ఆరోగ్య భవనం ప్రారంభం



ప్రసూతి, శిశు ఆరోగ్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ధనలక్ష్మి, అనంతబాబు

రంపచోడవరం: గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందేలా తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో రూ.12.06కోట్లతో నిర్మించిన ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగ భవనాన్ని శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు ప్రసూతి సేవలు మరింతా మెరుగ్గా అందుతాయన్నారు. గత టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఆలోచన కూడా చేయలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఏజెన్సీలో పర్యటించినప్పుడు గిరిజనులకు ఆరోగ్య సేవలు మెరుగుపరచాలనే ఉద్దేశంతో రంపచోడవరంలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరు చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చాపరాయిలో గిరిజనుల అనారోగ్య మరణాలు, విలీన మండలాల్లో కాళ్లవాపు వ్యాధితో అనేక మంది మృత్యువాత పడ్డారన్నారు. అలాంటి పరిస్థితుల్లో కూడా వైద్య సేవలను మెరుగుపరచలేదన్నారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చింతూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడమే కాకుండా, పీహెచ్‌సీల్లో వైద్య పోస్టుల భర్తీ చేసిందన్నారు. గిరిజనులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకున్నారని, వైఎస్సార్ సీపీ మన్యంలో హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. కె లక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఆస్పత్రి కమిటీ సభ్యులు తమ్మన్నకుమార్, కాపారపు రూతు పాల్గొన్నారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

గాజువాక : ఈ నెల 17 నుంచి 19 వరకు అనకాపల్లి జిల్లా నాగులాపల్లిలో రాష్ట్రస్థాయి మహిళ కబడ్డీ పోటీలు, జిల్లాస్థాయి పురుషుల కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్టు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వి.రాజేశ్వరి తెలిపారు. ఈ పోటీలు మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి తొమ్మిది గంటలకు వరకు కొనసాగుతాయన్నారు. ఈ పోటీలకు హాజరు కాగోరు జట్లు 768000566, 98856 98717 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి



సూచనలిస్తున్న డాక్టర్ జాన్

రంపచోడవరం: వచ్చేనెల 3న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏడీఎంహెచ్‌వో డా. ప్రకాశం సూచించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం పల్స్ పోలియో నిర్వహణపై వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0–5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ రెండు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల అన్నింటికి ఓపీవీ డ్రాప్స్ సరఫరా చేశామని చెప్పారు. ఏజెన్సీలోని 19 పీహెచ్‌సీలకు డీఐవో ద్వారా పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమానికి 578 బూత్‌లు, 69 రూట్‌లు, 26 మొబైల్ టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. సిబ్బందికి వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ జాన్ అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రంపచోడవరం, చింతూరుకు చెందిన వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మత్స్యగుండం జాతరకు ఆహ్వానం



ఎస్పీ తుహిన్‌సిన్హాకు ఆహ్వానపత్రం అందజేస్తున్న సర్పంచ్ శాంతకుమారి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: హుకుంపేట మండలంలో పవిత్ర పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో శివరాత్రి ఉత్సవాలకు నిర్వహణ కమిటీ ఆహ్వానాల పంపిణీ చేపట్టింది. వచ్చే నెల ఏడు నుంచి తొమ్మిది వరకు మూడు రోజులపాటు జరిగే శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ఎస్పీ తుహిన్‌సిన్హా, పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డిలకు ఆహ్వానాలు అందజేశారు. మఠం సర్పంచ్ మఠం శాంతకుమారి, ఆలయ కమిటీ ప్రతినిధి తమర్బ అప్పారావునాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మినుముల గోపాలపాత్రుడు, పాంగి మత్స్యకొండబాబు, కార్యదర్శి అంగనైని ఆనంద్ పాల్గొన్నారు.

ఆదిత్యుడికి ప్రత్యేక పూజలు



సూర్య భగవానుడికి పూజలు చేస్తున్న గిరిజనులు



ఇరుముడులతో గిరిజన పూజారులు

- ఘనంగా రథసప్తమి
- ఇరుముడులు సమర్పించిన గిరిజన పూజారులు

సాక్షి,పాడేరు: మండలంలోని సూకురుపుట్టులోని సూర్యనారాయణమూర్తి స్వామివారి ఆలయంలో రథసప్తమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ పరమహంస ఆధ్వర్యంలో గిరిజనులు ప్రత్యేకహోమం జరిపించారు. శుక్రవారం ఉదయం స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లోని గిరిజన పూజారులు ఇరుముడులను స్వామివారికి సమర్పించారు. స్వామివారం నామస్మరణ మార్మోగడంతో సూకురుపుట్టు ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రత్యేక భజన కార్యక్రమాలు, గిరిజన మహిళలు థింసా,కోలాటం ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.

శారదాపీఠంలో ఆధ్యాత్మిక వైభవం

కొనసాగుతున్న వార్షికోత్సవాలు

పెందుర్తి: జగన్మాత సన్నిధి ఆధ్యాత్మిక చింతనతో ఓలలాడింది. శారదాంబ ప్రాంగణంలో వేద ఘోషతో ప్రతిధ్వనించింది. సర్వప్రాణి శ్రేయస్సు కోసం తలపెట్టిన రాజశ్యామల, వనదుర్గ హోమాలతో ఆధ్యాత్మికత గుభాళించింది. రెండోరోజు శుక్రవారం యజ్ఞయాగాదులు దిగ్విజయంగా జరిగాయి. రథసప్తమి సందర్భంగా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు జరిపారు. పండితులు సూర్యనమస్కారాలతో ఆదిత్యుడిని కొలిచారు. పీఠం అనుష్టాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు విశేష అలంకరణలో దాసాంజనేయస్వామి, మేధాదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు ఆచరించారు. గోమాతకు పూజ చేసి నైవేద్యం అందించారు. జమ్మి చెట్టు ప్రదక్షిణ చేశారు.

సాయంత్రం శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణాన్ని వందలాది మంది భక్తులు తిలకించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం సారధ్యంలో పీఠంలో శ్రీనివాస కల్యాణం వేడుకగా నిర్వహించనున్నట్లు పీఠం ప్రతినిధులు తెలిపారు.


రథసప్తమి సందర్భంగా సూర్య నమస్కారాలు చేస్తున్న వేద పండితులు


యాగ శాలలో అమ్మవారికి పూజలు చేస్తున్న స్వామీజీలు


మల్లికార్జున కల్యాణం చేస్తున్న పండితులు


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా శ్రీనివాసమూర్తి బాధ్యతల స్వీకరణ

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సి.శ్రీనివాసమూర్తి శుక్రవారం కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఈపీడీసీఎల్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా చేరిన శ్రీనివాసమూర్తి వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ సీజీఎం హోదాలో 2023లో పదవీ విరమణ చేశారు. ఐటీ విభాగంలో విధులు నిర్వర్తించిన సమయంలో ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్, మైఈపీ, ఆన్లైన్ పేమెంట్, వాట్సాప్ ఆటోమేటెడ్ చాట్ తదితర ఐటీ ఆధారిత సేవలను రూపొందించారు. డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అతి కీలకమైన పదవిలో నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సమగ్ర మౌలిక సదుపాయాల ఏర్పాటులో భాగంగా ఇళ్లకు, వీధి దీపాలకు, వాటర్ వర్క్‌లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ వేసవిలో విద్యుత్ సరఫరాలో నాణ్యత పెంచడం ద్వారా వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసమూర్తిని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, డైరెక్టర్లు డి.చంద్రం, ఏవీవీ సూర్యప్రతాప్ అభినందించారు. సంస్థ ఉద్యోగులు, పలు యూనియన్, ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాసమూర్తిని సత్కరించి అభినందనలు తెలిపారు.


శ్రీనివాసమూర్తికి అభినందనలు చెబుతున్న సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

దొంగని పట్టుకున్న గిరిజనులు

డుంబ్రిగుడ: మండలంలో అరకు వారపు సంతలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి దొంగతనం చేస్తుండగా, దొంగ అంటూ గిరిజనులు అనుమానంతో పట్టుకున్నారు. అతడిని స్థానిక పోలీసులకు అప్పజెప్పడంతో విచారణ చేశారు. నిందితుడు ఆధార్ కార్డ్ పరిశీలించి పాడేరు వాసిగా గుర్తించి విడిచి పెట్టినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

కష్టపడితే విజయం తథ్యం

మారేడుమిల్లి : యువత కష్టపడి చదివితే విజయం తథ్యమని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి అన్నారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎస్ఐ, ఎస్సీ జీడీ కానిస్టేబుల్ అభ్యర్థులకు గత నెల రెండో తేదీన ప్రారంభించిన ఉచిత శిక్షణ శుక్రవారంతో ముగిసింది. పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. నియోజకవర్గం లో 46 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి కల్పించామని వెల్లడించారు. ఇతర పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్ఐలు రాము, సాయి కుమార్ పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి అభినందనల వెల్లువ




రాజ్యసభ అభ్యర్థి వైవీ సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్, జిల్లా పరిషత్, జీసీసీ చైర్‌పర్సన్లు జల్లిపల్లి సుభద్ర, స్వాతిరాణి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే పాల్గుణ కుటుంబ సభ్యులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్,రాజ్యసభ అభ్యర్థి వైవీ సుబ్బారెడ్డికి పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు శుక్రవారం అభినందనలు తెలిపారు. విశాఖలో ఆయనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్,ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతిదేవి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వై.వి.సుబ్బారెడ్డిని అరకు ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు చెట్టి పాల్గుణ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

కల్యాణం.. కమనీయం


స్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. రథసప్తమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని హంస మూలన ఉన్న రాతిరథంపై స్వామికి కల్యాణం నిర్వహించారు.

స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను రాతిరథంపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, అక్షింతలు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకుడు పవన్ తదితరులు కల్యాణం నిర్వహించారు.

21న మెగా జాబ్‌మేళా

రావులపాలెం రూరల్: ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ, మైక్రోసాఫ్ట్ కంపెనీల సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ బి.రాధాకృష్ణ తెలిపారు. జాబ్ మేళాలో పది కంపెనీలు పాల్గొని, ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని, పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు ఉన్నవారు ఈ ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చన్నారు. రంపచోడవరం పరిసర మండలాల్లోని నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలసిందిగా కోరారు. ఇతర వివరాల కోసం ఉద్యోగ మేళా కోఆర్డినేటర్ హెచ్.సుధీర్‌ను 7780688683 నంబర్లో సంప్రదించాల్సిందిగా ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


ప్రయాణానికి సిద్ధమైన యువతులు

చింతపల్లిరూరల్: ఉపాధి అవకాశాలను యువతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ అరుణ్ కిరణ్ అన్నారు. జీపీఎస్ కేంద్రం ప్రేరణ కార్యక్రమంలో భాగంగా జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైన 35 మంది యువతులను చింతపల్లి నుంచి బెంగళూరు ప్రత్యేక బస్సులో శుక్రవారం తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరుణ్ కిరణ్ మాట్లాడుతూ గిరిజన యువతులు మన్యానికే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాల్లో పని చేయడం వలన అనేక కొత్త విషయాలు తెలుసుకుంటారన్నారు. పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలతోనే ఉజ్వల భవిష్యత్తు


వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేస్తున్న పీవో సూరజ్ గనోరే


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న పీవో సూరజ్‌గనోరే

గంగవరం: టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తేనే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని, ఇందుకు కష్టపడి చదవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే సూచించారు. శుక్రవారం మండలంలోని వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. తరగతి గదులను, స్టోర్ రూమ్, మరుగుదొడ్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు అయ్యేలా ప్రణాళికగా చదవాలని ఆయన సూచించారు. అందుకు సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు తయారుచేసి ఎప్పటికప్పుడు పెట్టాలని సూచించారు. కూరగాయలు, నిత్యావసర వస్తువులు, కోడిగుడ్లు, స్టోర్ రూమ్‌లో స్టాక్‌ను పరిశీలించారు. సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

750 మందికి దంత వైద్య పరీక్షలు


మెగా దంత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సీఐ రవికుమార్

అడ్డతీగల : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అడ్డతీగల పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా దంత వైద్య శిబిరాన్ని అడ్డతీగల సీఐ రవికుమార్ ప్రారంభించారు. ఏజెన్సీలో గిరిజనులకు దంత సంరక్షణ, దంత ఆరోగ్యంపై అవగాహన కల్పించి దంత వైద్యం అందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో సుమారు 750 మందికి దంత పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో దంతాలను శుభ్రపరుచుట, పిప్పిపళ్లకు సిమెంట్ పెట్టుట, దంతాలను తొలగించుట, కృత్రిమ పళ్ల సెట్లను అమర్చారు. స్కూల్ పిల్లలకు అవగాహన కల్పించి, వారికి ఉచితంగా ఓరల్ హైజినిక్ కిట్లను అందించారు. ఈ దంత వైద్య శిబిరానికి 750 మంది చికిత్స అందించినట్లు తెలిపారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాల, రాజానగరం, ప్రిన్సిపాల్ సునీల్, విద్యార్థులు, మొబైల్ డెంటల్ క్లినిక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్షీరాభిషేకం

దాకాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజలు చేయడానికి ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. ఏ పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించి వారికి సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె. త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలివి..


● టాటా–ఎర్నాకుళం(08189) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19, 26 తేదీల్లో సాయంత్రం 5.15 గంటలకు టాటాలో బయల్దేరి ఆదే రోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 8.45 గంటలకు బయల్దేరి మూడో రోజు మధ్య రాత్రి 1.55 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో ఎర్నాకుళంలో ఈ నెల 22, 29 తేదీల్లో ఉదయం 7.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి మూడో రోజు తెల్లవారుజామున 4.35 గంటలకు టాటా చేరుకుంటుంది.

● కన్యాకుమారి–డిబ్రూఘడ్(06103) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, మార్చి 1, 15, 29 తేదీల్లో (శుక్రవారాలు) సాయంత్రం 5.25 గంటలకు కన్యాకుమారిలో బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు విశాఖ వస్తుంది. అక్కడ నుంచి 12.05 గంటలకు బయల్దేరి సోమవారంల్లో రాత్రి 8.50 గంటలకు డిబ్రూఘడ్ చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో డిబ్రూఘడ్– కన్యాకుమారి(06104) స్పెషల్ ఈ నెల 21, మార్చి 6, 20, ఏప్రిల్ 3 తేదీల్లో రాత్రి 7.55 గంటలకు డిబ్రూఘడ్‌లో బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం వస్తుంది. అక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి శనివారాల్లో రాత్రి 9.55 గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు


అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: పాడేరు డివిజన్‌లో ఖాళీగా ఉన్న 28 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి తన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు గాను ఐదుగురు, 18 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు 15 మంది, ఎనిమిది మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 8మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఆమోదం నిమిత్తం కలెక్టర్ నివేదిక పంపుతున్నట్టు ఆమె పేర్కొన్నారు. దరఖాస్తులు రాని ఒక అంగన్‌వాడీ కార్యకర్త, మూడు హెల్పర్ పోస్టులకు మళ్లీ నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, వైద్య ఆరోగ్యశాఖ ప్రతినిధులు మోహన్, సీడీపీవోలు, ప్రాజెక్టుల సీడీపీవోలు పాల్గొన్నారు. ఆయా పోస్టుల భర్తీకి స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థులు 13 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మార్కుల ఆధారంగా పూర్తి పారదర్శకతతో నియామకాలు చేపడతామని తెలిపారు. మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సీడీపీవోలు విజయగౌరి, నాగలక్ష్మి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

చింతూరు: డివిజన్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు,